సాక్షి
అనకాపల్లి
సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



ఉత్సాహంగా ఇంటర్ క్లబ్ తైక్వాండో పోటీలు

ఇంటర్ క్లబ్ టైక్వాండో పోటీలలో యలమంచిలి క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచారు. 8లో



విశాఖలో కోచ్ రెస్టారెంట్

విశాఖ రైల్వేస్టేషన్ వద్ద కోచ్ రెస్టారెంట్ రేపు అందుబాటులోకి రానుంది. వాల్తేరు డివిజన్ వినూత్నంగా ఈ ప్రాజెక్టు చేపట్టింది. 12లో



పుణ్యకోటి వాహనంపై స్వామివారు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారిని పుణ్యకోటి వాహనంలో ఊరేగించారు. 8లో

రైతుల పేరిట స్వాహాకు యత్నం..

పచ్చనేతల భూదాహం

- నాటి టీడీపీ అడ్డగోలు సర్వేకు ప్రభుత్వం చెక్
- 2019 డిసెంబర్‌లో మరోసారి ముదపాక భూముల్లో సమగ్ర సర్వే
- అర్హులైన 179 మంది రైతులకు ఎల్‌పీవోలు జారీ
- ఓర్వలేక ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కోర్టుల్లో కేసులు

ముదపాక భూముల్లో తన అనుయాయుల కోసం తెలుగుదేశం ప్రభుత్వం నిర్వహించిన అడ్డగోలు సర్వేలో అసలు నిజాలు ప్రభుత్వం మారిన తర్వాత బట్టబయలయ్యాయి. అర్హులైన లబ్ధిదారులకు మొండి చెయ్యి చూపించేలా పచ్చతమ్ముళ్లకు పప్పు బెల్లాల మాదిరిగా ముదపాక భూముల్ని పంచిపెట్టిన టీడీపీ అక్రమాలకు ప్రభుత్వం కొత్త సర్వేతో అడ్డుకట్ట వేసింది. 179 మంది రైతులను అసలైన అర్హులుగా గుర్తించి వారికి ఎల్‌పీవోలు జారీ చేసింది. ఈ భూముల్లో జగనన్న కాలనీలు నిర్మించి పేదలకు గూడు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే.. అక్రమంగా లాక్కొన్న భూములు పేదల పరమవుతుండడంతో ఓర్వలేక.. కేసుల పేరుతో కక్ష తీర్చుకునేందుకు టీడీపీ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.





సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

టీడీపీ ప్రభుత్వం చేపట్టిన ఎంజాయ్‌మెంట్ సర్వేలో అర్హులుగా అక్కడి స్థానిక టీడీపీ ఎమ్మెల్యే అనుచరుల పేర్లనే ఎక్కువగా జోడించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముదపాక భూముల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించింది. వెంటనే కొత్తగా రెవెన్యూ, సర్వే, ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారులతో కూడిన బృందాల్ని నియమించి.. మరోసారి పక్కాగా సర్వే నిర్వహించింది. 2019 డిసెంబర్ 26న ఈ బృందాలు సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించాయి. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ల బృందాలు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి తుది నివేదికను సిద్ధం చేశాయి. ఈ సర్వేలో టీడీపీ నేతల అడ్డగోలు వ్యవహారాలు బట్టబయలయ్యాయి. అక్కడ సెంటు భూమి కూడా లేని వారి పేర్లతో దాదాపు 34 ఎకరాలను కాజేసేందుకు ప్రయత్నించినట్లు స్పష్టమైంది. వీటన్నింటినీ రద్దు చేశారు. అప్పటి ల్యాండ్‌పూలింగ్ అండ్ ఎస్‌ఏవోటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలో అనర్హుల జాబితాను తొలగించి 193 మంది అసలైన అర్హుల్ని గుర్తించారు. వీరికి 378.83 ఎకరాల్ని అర్హులకు అందజేస్తున్నట్లు 2020 జనవరి 27 ముదపాక గ్రామ పంచాయతీలో జాబితా ప్రచురించారు. వీరందరికి ల్యాండ్ పొజిషన్ ఓనర్‌షిప్(ఎల్‌పీవో) సర్టిఫికెట్స్ కూడా జారీ చేశారు.

పేదలందరికీ ఇళ్ల కోసం..

ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల్ని గుర్తించిది. ఇందులో భాగంగా ముదపాక భూములను కూడా ఎంపిక చేశారు. నిర్మాణ యోగ్యమైన భూముల్ని గుర్తించాలని నిర్ణయించారు. అప్పటి పెందుర్తి తహసీల్దార్ బాబ్జీ.. మరోసారి జాబితాను పరిశీలించారు. వీరిలో నిజమైన అసైనీలు 179 మంది మాత్రమే ఉన్నారని గుర్తించి వారికి బార్‌కోడింగ్‌తో కూడిన ఎల్‌పీవోలు జారీ చేశారు. అదేవిధంగా.. ముదపాకలో ఉన్న భూముల్లో సర్వే నం.1లో కొంత భాగం కొండ ప్రాంతం కావడంతో నిర్మాణయోగ్యం కాదని గుర్తించారు. వాటిని కూడా జగనన్న కాలనీల జాబితా నుంచి మినహాయించారు. మిగిలిన భూములకు సంబంధించి ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ చేపట్టేందుకు వీఎంఆర్‌డీఏ 2020 జనవరి 27న నోటిఫికేషన్ ప్రచురించింది. పెందుర్తి మండలానికి సంబంధించి ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ పూర్తి చేసి సమీకరించిన భూములను అదే ఏడాది మార్చి 2న వీఎంఆర్‌డీఏకు పెందుర్తి తహసీల్దార్ సమక్షంలో అప్పగించారు. ఇందులో ముదపాకలోని సర్వే నం.38లో 85.60 ఎకరాలు, సర్వే నం.76లో 247.99 ఎకరాలు, సర్వే నం.1లో 106.27 ఎకరాలు చొప్పున మొత్తం 439.86 ఎకరాలు ఉన్నాయి.

అడ్డం తిరిగిన 'టీడీపీ' రైతులు

ఈ భూములను అభివృద్ధి చేసి జగనన్న కాలనీ ఇళ్లు నిర్మించి బలహీన వర్గాలకు అందించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. వీఎంఆర్‌డీఏ, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో గ్రౌండింగ్ పనులు ప్రారంభించారు. సర్వే నం.1, 76లో 266.03 ఎకరాల విస్తీర్ణంలోనూ, సర్వే నం.66, 71/2, 75, 80, 83/2లోని 50.24 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ సిద్ధం చేశారు. మరోవైపు అసైనీలు, ఆక్రమణదారుల నుంచి అంగీకారం పొందే ప్రక్రియను కూడా ప్రారంభించారు. ముందుగా అంగీకారం తెలిపిన రైతుల్లో కొంతమంది టీడీపీ నేతల ప్రోద్బలంతో అడ్డం తిరిగారు. తొలుత స్వచ్ఛందంగా అంగీకారం తెలిపిన రైతులు.. రెవెన్యూ యంత్రాంగం సర్వే నివేదికలను మార్చేసి తమకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని.. తిరిగి తమ భూములు తమకు ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ రైతులకు సంబంధించిన భూముల్లో లేఅవుట్స్ ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోయింది. ఇలా.. పేదలకు ఇళ్లు అందించాలన్న లక్ష్యాన్ని టీడీపీ నేతలు నీరుగార్చి.. ఆ భూములు పేదలకు దక్కకుండా తమ పరం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు బార్ వినతి



సీజేకి వినతిపత్రం అందిస్తున్న బార్ అధ్యక్షుడు

చోడవరం రూరల్ : అసంపూర్తిగా నిలిచిపోయిన చోడవరం కోర్టుల సముదాయ భవన నిర్మాణ పనులను చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు చోడవరం బార్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఆదివారం ఉమ్మడి విశాఖ జిల్లా కోర్టుకు అధికారిక కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, కార్యదర్శి గొర్లె కృష్ణవేణి, అల్లు గిరిధర్ బృందం మర్యాద పూర్వకంగా కలిసింది. చోడవరం కోర్టుల సముదాయంలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయిన సంగతిని సీజే దృష్టికి తీసుకు వెళ్లారు. అసంపూర్తి పనులతో నిలిపివేసిన గుత్తేదారును తొలగించారని, తాజాగా ఉన్న నిధుల మేరకు భవన నిర్మాణ పనులు తిరిగి చేపట్టాలని కోరారు. ఈ మేరకు సీజేకి సంపూర్ణ నివేదికతో వినతి పత్రాన్ని అందచేశారు.

కేంద్ర మంత్రికి సాదర స్వాగతం



విశాఖ విమానాశ్రయంలో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి స్వాగతం పలుకుతున్న బీజేపీ నేతలు

గోపాలపట్నం: కేంద్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీకి ఆదివారం విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఒక్క రోజు పర్యటనలో భాగంగా ఉదయం 8.30 గంటలకు ఆమె విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆమెకు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. నగరంలో కార్యక్రమం ముగించుకుని ఉదయం 11.30గంటలకు ఢిల్లీ బయలుదేరారు. ఆమెను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, నాయకులు కాశీరాజు, నాగేంద్ర, సురేంద్ర మోహన్, బాల రాజేశ్వరరావు తదితరులు వీడ్కోలు పలికారు.

మహిళా బిల్లు ఆమోదం హర్షణీయం



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ అమ్మాజీ

ఎస్.రాయవరం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహిళా బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ అన్నారు. అడ్డురోడ్డు జంక్షన్‌లో ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెటుడుతున్న సంక్షేమ పథకాలు మహిళలకే పెద్ద పీట వేస్తున్నారన్నారు. కేంద్రం చేసిన ఆలోచనకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి నామినేటెడ్ పదవులు మొదలు సంక్షేమ పథకాల్లో కూడా మహిళలకే అధిక ప్రాధాన్యం ఇస్తూ వస్తున్నారన్నారు. అదే క్రమంలో కేంద్రం ప్రవేశ పెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు అమల్లోనికి వచ్చిన తరువాత మహిళలకు మరింత ప్రాధాన్యం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు ఎట్టకేలకు ఆమోదం పొందడం అభినందనీయమన్నారు.

నేడు కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాక

విశాఖలో మెరైన్ మ్యూజియాన్ని ప్రారంభించనున్న మంత్రి



మెరైన్ మ్యూజియం

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖల మంత్రి పర్షోత్తమ్ రూపాల సోమవారం విశాఖ వస్తున్నారు. ఉదయం 8.15 గంటలకు ఢిల్లీ నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి బీచ్‌రోడ్డులో ఉన్న ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) కార్యాలయానికి 11 గంటలకు వెళ్తారు. అక్కడ ఆధునీకరించిన మెరైన్ మ్యూజియంను ప్రారంభిస్తారు. అనంతరం ఎఫ్ఎస్ఐ, సెంట్రల్‌ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్, నాటికల్ అండ్ ఇంజినీరింగ్ ట్రెనింగ్ (సిఫ్‌నెట్), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ అండ్ ట్రెనింగ్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.

మంత్రికి సచివాలయ ఉద్యోగుల వినతి



మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సచివాలయ అసోసియేషన్ ప్రతినిధులు

మహారాణిపేట: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఉద్యోగులు కోరారు. ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ భార్గవ్ సుతేజ్, జిల్లా అధ్యక్షులు గణేష్ కుమార్ ఆదివారం ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. జీవీఎంసీ పరిధిలోని 578 మంది వార్డు పరిపాలన కార్యదర్శులకు పీవోఎస్ మిషన్లు అందజేసి 25 రకాల పన్నులు వసూలు చేయాలని ఉన్నతాధికారులు సూచించారన్నారు. ఈ ప్రక్రియలో ఉత్పన్నమయ్యే సమస్యలను అధికారులకు వివరించినట్లు చెప్పారు. ఈ విషయంలో ఎటువంటి పునరాలోచన చేయలేదని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మంత్రి అసెంబ్లీ సమావేశాల తర్వాత ఈ సమస్యపై సమీక్షిస్తానని హామీ ఇచ్చినట్లు భార్గవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ తెలిపారు.

వచ్చే నెలలో వెటరన్ అథ్లెటిక్స్

మురళీనగర్: విశాఖ జిల్లా వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 29న వెటరన్ అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.బాబురావు, మంగా వర ప్రసాద్ తెలిపారు. ఈ పోటీలు విశాఖ పోలీసు బ్యారెక్స్ గ్రౌండ్‌లో ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. 30 ఏళ్లు దాటిన స్త్రీ, పురుష అథ్లెటిక్స్ పాల్గొనవచ్చన్నారు. రన్నింగ్ (100మీ./200మీ/400మీ/800మీ/ 1500మీ/5000మీ), వాకింగ్ (5కి.మీ), లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షాట్ పుట్, జావలిన్ త్రోన్, డిస్కస్, హేమర్ త్రో పోటీలు నిర్వహిస్తామన్నారు.

సత్సంబంధాలతోనే ఉన్నతమైన తీర్పులు



బార్ కౌన్సిల్ సభ్యులు, విశాఖ జిల్లా కోర్టుల న్యాయమూర్తులతో చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్
- జిల్లా కోర్టు ఆవరణలో నూతన భవన సముదాయం ప్రారంభం

విశాఖ లీగల్: జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన పది న్యాయస్థానాల నూతన భవనాలను ఆదివారం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రారంభించారు. ముందుగా చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు కలెక్టర్ ఎ.మల్లికార్జున స్వాగతం పలికారు. కోర్టు సముదాయం నిర్మాణానికి సంబంధించిన పలు విషయాలను కలెక్టర్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ న్యాయమూర్తులు.. న్యాయవాదుల మధ్య సత్సంబంధాలు ఉన్నతమైన తీర్పులకు దిశా నిర్దేశం చేస్తాయన్నారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, విశాఖ పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 10 న్యాయస్థానాలను 10 దేవాలయాలుగా అభివర్ణించారు. ప్రస్తుతం విశాఖలో 71 న్యాయస్థానాలు ఉన్నాయని.. వాటిలో 29 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. నూతనంగా నిర్మించిన న్యాయస్థానాలకు 15,133 కేసులు బదిలీ చేస్తున్నట్లు వివరించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ విశాఖలో తాను తొమ్మిదేళ్లు పనిచేశానని.. ఎన్నో ఉన్నతమైన తీర్పులు ఇచ్చినట్లు గుర్తు చేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్ సోమయాజులు మాట్లాడుతూ కక్షిదారుల ఔన్నత్యాన్ని గుర్తించి, వారిని గౌరవించాలన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి మాట్లాడుతూ న్యాయస్థానాలు ఏర్పాటు కంటే వాటిని నిత్యం అందంగా ఉంచడం, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ముఖ్యమన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మాట్లాడుతూ తొలి దశలో పది న్యాయస్థానాలను కొత్త భవనాల్లోకి మారుస్తున్నామన్నారు. ప్రముఖ న్యాయవాది కె.వి.రామ్మూర్తి మాట్లాడుతూ న్యాయానికి కుల మత విచక్షణ, అసమానతలు ఉండవన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు నివేదిక సమర్పించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామజోగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

టూరిజం అభివృద్ధికి కేరాఫ్‌గా బొజ్జన్నకొండ

- అనకాపల్లిలో రూ.3 కోట్లతో టీటీడీ కల్యాణమండపం
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- రూ.7.3 కోట్లతో బొజ్జన్నకొండ అభివృద్ధి పనులకు భూమిపూజ



సమావేశంలో మాట్లాడుతున్న వై.వి.సుబ్బారెడ్డి

తుమ్మపాల : బొజ్జన్నకొండను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసి జిల్లాలో టూరిజం అభివృద్ధితో పాటు పారిశ్రామిక జిల్లాగా చేసేందుకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలో శంకరం గ్రామంలో గల బొజ్జన్నకొండ వద్ద ఎంపీ బి.వి.సత్యవతి ఆధ్వర్యంలో టూరిజం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బెల్లానికి గుర్తింపుగా ఉన్న అనకాపల్లి, ఇక నుంచి బొజ్జన్నకొండ ద్వారా పర్యాటకానికి కేరాఫ్‌గా మారనుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బొజ్జన్నకొండ అభివృద్ధికి రూ.7.3 కోట్ల నిధులు మంజూరు కావడంతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయన్నారు. కేంద్రంలో ఆర్కియాలజీ శాఖ అనుమతులు, కేంద్ర నిధుల మంజూరులో ప్రత్యేక చొరవ తీసుకుని ఈ కార్యక్రమానికి ఎంపీ బి.వి.సత్యవతి ఎనలేని కృషి చేశారని అభినందనలు తెలిపారు. జిల్లాలో మెడికల్ కళాశాల నిర్మాణం కూడా వేగంగా జరుగుతుందన్నారు. రాబోయే కాలంలో రాష్ట్రంతో పాటు, జిల్లాను మరింత అభివృద్ధి చేసుకునేందుకు అందరం కలిసి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ మన ప్రాంతానికే తలమానికంగా ఉన్న బొజ్జన్నకొండ అభివృద్ధిపై పట్టుదలతో ఎంపీ కృషి చేశారని అన్నారు. వై.వి.సుబ్బారెడ్డి చొరవతో అనకాపల్లిలో టీటీడీ కల్యాణమండపం, టికెట్ కౌంటర్ నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఎంపీ సత్యవతి కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలతో చర్చించి నిధులు మంజూరుతో పాటు పనులు ప్రారంభానికి విశేష కృషి చేశారన్నారు. రానున్న జనవరి నాటికి పనులు పూర్తి చేసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు కార్యాచరణ వేగం చేయాలన్నారు. ఎంపీ బి.వి.సత్యవతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.7.3 కోట్ల నిధులలో రూ.2.5 కోట్లతో భవనాలు నిర్మాణానికి కేటాయించినప్పటికీ ఆర్కియాలజీ శాఖ నిబంధనల ప్రకారం బొజ్జన్నకొండ పరిసరాలలో అనుమతులు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం చొరవతో స్థల సేకరణ చేశామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తక్షణమే స్పందించి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న స్థలాన్ని టూరిజంకు బదలాయించారని, ఈ రోజున వై.వి.సుబ్బారెడ్డి చేతుల మీదుగా భూమిపూజ చేసి పనులు ప్రారంభించడం శుభపరిణామన్నారు. బొజ్జన్నకొండపై లైటింగ్ షో ఏర్పాటుకు రూ.5 కోట్ల మేర ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. రోడ్డు నిర్మాణాన్ని రూ.1.43 కోట్ల ఎంపీ లాడ్స్ నిధులతో చేపడుతున్నామన్నారు. ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్, డాక్టర్ విష్ణుమూర్తి, పర్యాటక శాఖ ఈఈ రమణ, ఎంపీపీలు సూరిబాబు, గున్నంనాయుడు, సర్పంచ్ లక్ష్మి, పార్టీ నేతలు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, దంతులూరి దిలీప్‌కుమార్, బొడ్డేడ ప్రసాద్, దాడి రత్నాకర్

జగనన్న ఆరోగ్య సురక్ష... పేదలకు రక్ష

సాధారణంగా సామాన్యులు కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ వాటిని తేలిగ్గా తీసుకుని వైద్యం చేయించుకోవడంలో నిర్లక్ష్యం చేస్తుంటారు. మరికొందరు వ్యాధి ఏమిటో తెలియకుండా ఇబ్బంది పడుతుంటారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా సర్వే నిర్వహించి అటువంటి వారికి ప్రత్యేక వైద్యం అందించాలని సంకల్పించింది. సాధారణ ఆరోగ్య సమస్యలతో పాటు క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధి, రక్తహీనత...ఇలా వ్యాధి ఏదైనా ముందుగా గుర్తించి సకాలంలో వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం.

- జిల్లాలో ముమ్మరంగా ఆరోగ్య సర్వే
- 30 నుంచి నవంబరు 2 వరకు వైద్య శిబిరాలు

నర్సీపట్నం : సామాన్య ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సచివాలయాల పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారికి స్థానికంగా వైద్యం అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి సర్వే ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతంలో 424 పీహెచ్‌సీలు, పట్టణాల్లో 9 అర్బన్ హెల్త్‌సెంటర్ల పరిధిలో 7,30,832 జనాభా వివరాలు సేకరించాల్సి ఉండగా నేటి వరకు 1,76,708 మంది వివరాలను సేకరించారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా సాగుతుంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు ఎంపీడీవో, తహసీల్దార్, మున్సిపాలిటీలలో కమిషనర్లు ప్రత్యేక పర్యవేక్షులుగా వ్యవహరిస్తున్నారు. సర్వే టీంకు సూచనలు, సలహాలు ఇస్తూ సర్వే వేగంగా జరిగేలా చూస్తున్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహిస్తున్న గొలుగొండ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

30 నుంచి వైద్య శిబిరాలు

ఈ నెల 30 నుంచి వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా నవంబరు 2వ తేదీ వరకూ 433 వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. వైద్య శిబిరాలు జరిగే షెడ్యూల్ బట్టి ఆయా ప్రాంతాల్లో ఇంటింటా సర్వేను వైద్య సిబ్బంది నిర్వహిస్తున్నారు. సర్వేలో ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి స్థానికంగా ఏర్పాటు చేసే వైద్యశిబిరాల్లో ఉచితంగా వైద్యంతో పాటు మందులు అందజేస్తారు. క్యాంపుల్లో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు ఉంటారు. రోగి ఆరోగ్య పరిస్థితి బట్టి మెరుగైన వైద్యం అవసరమైతే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేస్తారు.

స్పెషలిస్టులతో వైద్యం



ఇంటింటా సర్వే అనంతరం వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సర్వే శరవేగంగా సాగుతుంది. షెడ్యూల్ ప్రకారం 30 నుంచి నవంబరు 2వ తేదీ వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తాం. సర్వేలో భాగంగా షుగర్, బీపీ, రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తున్నాం. వైద్య శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు, సూచనల మేరకు సురక్ష కార్యక్రమం విజయవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

డాక్టర్. జ్యోతి(జిల్లా అదనపు వైద్యాధికారి)

డాక్టర్ మురళీమోహన్‌రావుకు ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ మురళీమోహనరావు

మహారాణిపేట: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి, కరోనా పరీక్షల ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.మురళీమోహనరావుకు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. బిలాస్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ కన్వేషన్ ఆఫ్ అప్తామాలిక్ ఆఫ్ ఇండియా 13వ జాతీయ సదస్సులో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఏసీవోఐఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లకేష్ సి మధారియా చేతుల మీదుగా ఈ అవార్డును డాక్టర్ మురళీమోహన్‌రావు అందుకున్నారు.

2 వరకు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా విశాఖ నుంచి, విశాఖ మీదుగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్(డీసీఎం) ఎ.కె త్రిపాఠి తెలిపారు. ఈ నెల 25 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు రాజమండ్రి-విశాఖపట్నం-రాజమండ్రి (07466/07467) పాసింజర్ స్పెషల్, గుంటూరు-విశాఖపట్నం(17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, గుంటూరు-రాయగడ (17243) ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-విశాఖపట్నం (17219) ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి. ఈ నెల 26 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు విశాఖపట్నం-గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, రాయగడ-గుంటూరు(17244) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. ఈ నెల 25, 26, 27, 29, 30 తేదీల్లో విశాఖపట్నం-విజయవాడ-విశాఖపట్నం (22701/22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌ను ఇరువైపులా రద్దు చేసినట్లు డీసీఎం వెల్లడించారు. మిగిలిన రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు ధన్‌బాద్-అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్, 24, 26వ తేదీల్లో హతియా-ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్, 25న హతియా-ఎర్నాకుళం(22837) ఎక్స్‌ప్రెస్, 27న జసిద్ధి-తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్, 28న టాటానగర్-యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్, 29న టాటానగర్-ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్‌లు రెగ్యులర్ మార్గం నిడదవోలు-ఏలూరు-విజయవాడ మీదుగా కాకుండా వయా నిడదవోలు-భీమవరం టౌన్-గుడివాడ-విజయవాడ మీదుగా నడుస్తాయి. ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని డీసీఎం సూచించారు.

ఇంటింటికీ పరిశుభ్రమైన తాగునీరు జేజేఎం లక్ష్యం

- నేషనల్ జల్ జీవన్ మిషన్ సభ్యుడు ఈశ్వర చంద్ జైన్
- క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న నేషనల్ జల్ జీవన్ మిషన్ సభ్యులు

మాడుగుల : ఇంటింటికీ పరిశుభ్రమైన తాగునీరు అందించడమే జేజేఎం లక్ష్యం అన్ని నేషనల్ జల్‌జీవన్ మిషన్ సభ్యుడు ఈశ్వరచంద్ జైన్ తెలిపారు. హర్‌ఘర్‌జల్ కార్యక్రమంలో భాగంగా చీడికాడ మండలంలో బి.సింగవరం, తంగుడుబిల్లి, వింటిపాలెం గ్రామాల్లో ఆదివారం నేషనల్ జలజీవన్ మిషన్ సభ్యులు పర్యటించారు. రక్షిత మంచి నీటి పథకాలు, పంప్‌హౌస్‌లతో పాటు ఇంటింటికీ కనెక్షన్లను పరిశీలించారు. ప్రతి నెలా విలేజ్ వాటర్ శానిటేషన్ కమిటీ ద్వారా గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసుకుని నీరు, పారిశుధ్యం గురించి చర్చించుకోవాలన్నారు. జాలంపల్లి పంచాయితీ శివారు గిరి గ్రామం మేడవీధిలో 10 వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి పథకాన్ని పరిశీలించారు. కుళాయిల ద్వారా సురక్షితమైన జలం వస్తుందో లేదోనని పరిశీలించి తాగునీరు బాగుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి పారిశుధ్యంతో పాటు తాగునీరు పరిశుభ్రంగా ఉండాలంటే ప్రభుత్వం లక్ష్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా మురుగు నీరు నిలిచి ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, సర్పంచ్ ధారా మల్లేశ్వరి చిన్ని, ఉపసర్పంచ్ బోర లక్ష్మి చిన్న, నేషనల్ జల్ జీవన్ సభ్యులు సుశీల్ కుమార్ చౌబె, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బి.నాగేశ్వరరావు, డీఈ ఎ. సూర్యనారాయణ, ఏఈ నరసింగరావు, పంచాయతీ కార్యదర్శి గెంజి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అనుకోని ప్రమాదం.. అంతులేని ఆవేదన!

ప్రమాదం ఏ రూపంలో వస్తుందో చెప్పలేం... ఓ కుటుంబాన్ని అనుకోని ప్రమాదం రోడ్డున పడేసింది. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తిని వ్యాన్ బలంగా ఢీకొట్టడంతో ఆస్పత్రి పాలయ్యాడు. హృద్రోగ సమస్యతో అతడి తల్లి మంచం పట్టగా.. వృద్ధాప్య తండ్రి దీనస్థితిలో ఉండగా.. ఆ ఇంటి ఇల్లాలు ఆపన్నహస్తం కోసం ఎదురు చూపులు చూస్తోంది.

- ప్రమాదానికి గురై మంచంపైనే కుమారుడు
- తల్లికి హృద్రోగ సంబంధిత వ్యాధి
- నిస్సహాయ స్థితిలో వృద్ధ తండ్రి
- దాతల సాయం కోసం వేడుకోలు

రావికమతం: మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన పడమటి శ్రీనివాసరావు (44) దుస్థితి పగవాడికి రాకూడదు. ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ ఎడ్యుకేషనల్ పూర్తి చేసిన అతడు కొన్నాళ్లపాటు ఉచితంగా విద్యార్థులకు ట్యూషన్ చెప్పేవాడు. పలువురికి సాయమందిస్తూ అందరిలో మంచి సేవాపరుడిగా గుర్తింపు పొందాడు. ఇంటి వద్ద చిల్లర కొట్టు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ నేపథ్యంలో అనుకోని ప్రమాదం అతని జీవితాన్ని ఒక్కసారిగా తలకిందుల చేసింది. ఈ నెల 14న ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేయాలన్న వేగంతో తన ఇంటి ముందున్న శ్రీనివాసరావును అదే గ్రామానికి చెందిన విస్తరాకుల వ్యాపారి పుల్లా వెంకటేశ్వరరావు వ్యాన్ బలంగా ఢీకొట్టడంతో తీవ్ర ప్రమాదానికి గురయ్యాడు.



ఆర్థిక సాయం అందిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



ఆర్థిక సాయం అందిస్తున్న బాధితుడి మిత్రులు

కేజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్..

ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన శ్రీనివాసరావుకు విశాఖ కేజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్ చేశారు. అతడి పక్కటెముక కింద ప్లీహం పూర్తిగా దెబ్బతింది. రక్త కణాలను రీసైక్లింగ్ చేసే ఈ ముఖ్యమైన అవయవాన్ని తొలగించాల్సి వచ్చింది. ప్రస్తుతం తన ఇంట్లోనే మంచం పట్టాడు. అతడి తల్లి సత్యవతి గుండెజబ్బుతో మంచానికే పరిమితమైంది. వృద్ధుడైన తండ్రి వెంకటరావు నిస్సహాయ స్థితిలో దీనంగా రోదిస్తున్నాడు. ఇద్దరు పిల్లలతో శ్రీనివాసరావు భార్య ఒక్కర్తే తీవ్ర దుఃఖంతో కుటుంబాన్ని నెట్టుకొస్తోంది.



గుండె జబ్బుతో మంచం పట్టిన తల్లి, పక్కన వృద్ధాప్యంతో దీనంగా ఉన్న తండ్రి

పలువురి దాతల ఆర్థిక సాయం



ప్లీహం తొలగింపుతో నిస్సహాయ స్థితిలో శ్రీనివాసరావు

ఎందరికో సహాయ సహకారాలందించిన శ్రీనివాసరావు ప్రమాద సంఘటన తెలుసుకుని పలువురు చలించిపోయారు. కొత్తకోట ఆర్యవైశ్య సంఘం సభ్యులు రూ.60 వేలు, శ్రీనివాసరావు మిత్రబృందం రూ.40 వేలు, కొత్తకోట ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు రూ.15 వేలు చొప్పున ఆదివారం అందించారు. ఇంకా సహాయానికి పలువురు ముందుకు వస్తున్నారు.

ఉత్సాహంగా ఇంటర్ క్లబ్ తైక్వాండో పోటీలు



ఇంటర్ క్లబ్ తైక్వాండో పోటీల్లో పతకాలు పొందిన క్రీడాకారులు

యలమంచిలి : ఇంటర్ క్లబ్ టైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలలో యలమంచిలి తైక్వాండో క్లబ్‌కు చెందిన క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచినట్టు తైక్వాండో క్లబ్ గౌరవ అధ్యక్షుడు నగిరెడ్డి దొరయ్య ఆదివారం తెలిపారు. యలమంచిలిలో రాజీవ్ క్రీడా ప్రాంగణం వద్ద ఆదివారం ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 9 తైక్వాండో క్లబ్‌లకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. సబ్ జూనియర్, జూనియర్, క్యాడేట్ విభాగాల్లో జరిగిన పోటీల్లో బాల బాలికలు తమ ప్రతిభను చూపారు. యలమంచిలి తైక్వాండో క్లబ్‌కు చెందిన క్రీడాకారులు ప్రథమ స్థానం, ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు క్లబ్‌కు ద్వితీయ స్థానం, విశాఖ జిల్లా గాజువాక, నడుపూరు క్లబ్‌కు తృతీయ స్థానంలో నిలిచాయని తెలిపారు. జూనియర్ సీనియర్ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బంగారు, రజత, కాంస్య పతకాలు బహుకరించారు. యలమంచిలి తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో రెండు జిల్లాల నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జగదీష్ పాల్, రాష్ట్ర సంఘం టెక్నికల్ మెంబర్ కళ్లేపల్లి శంకరరావు, బుజ్జి, డాక్టర్ శ్రీకాంత్, నేషనల్ రిఫరీలు యశోదరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో 20 మంది విద్యార్థులు పతకాలు సాధించినట్టు కోచ్ చందు తెలిపారు. యలమంచిలిలో ఆదివారం జరిగిన పోటీల్లో అడ్డురోడ్డు చందు తైక్వాండో శిక్షణ కేంద్రం నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 14 మంది బంగారు పతకాలు, 4 కాంస్య, 2 రజత పతకాలు సాధించినట్టు చెప్పారు. ఈ మేరకు తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి ఎన్. సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పి.అచ్చుత్‌రెడ్డి , వైస్ ప్రెసిడెంట్ ఎం.అచ్చెంనాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు, కోచ్ చందు అభినందనలు తెలిపారు.

చంద్రబాబుకు లోకేష్ తోనే ముప్పు

- తండ్రి జైల్లో ఉంటే కొడుకు ఢిల్లీలో ఎంజాయ్ చేస్తున్నాడు
- చంద్రబాబు మోసం చేసినా మోత్కుపల్లికి సిగ్గురాలేదు
- మాజీ ఎమ్మెల్యే చెంగల



నక్కపల్లి : చంద్రబాబుకు జైల్లో దోమల వల్ల ఎటువంటి ముప్పులేదని సీఎం పదవిపై విపరీతమైన వ్యామోహంతో ఉన్న కొడుకు లోకేష్ వల్లే ముప్పు ఉందని పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు అన్నారు. ఆదివారం ఆయన పాయకరావుపేట విలేకర్లతో మాట్లాడుతూ దేశంలో అత్యంత అవినీతి పరుడు చంద్రబాబు అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.375 కోట్ల ప్రజాధనం లూటీ చేసి సిఐడీకి దొరికిపోవడం వల్లే జైలు పాలయ్యాడన్నారు. చంద్రబాబు అరెస్టుతో ముఖ్యమంత్రి జగన్‌కు ఎటువంటి సంబంధం లేదన్నారు. నాలుగేళ్ల క్రితమే సీఐడీ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిందన్నారు. 140 మంది సాక్షులను విచారించిన తర్వాతే చంద్రబాబును అరెస్టు చేసారన్నారు. గతంలో గవర్నర్ పదవి ఇస్తానని మోసం చేయడం వల్లే మోత్కుపల్లి టీడీపీకి రాజీనామా చేశాడని అన్నారు. అప్పుడు చంద్రబాబును నీచుడు, మోసగాడు, వెన్నుపోటుదారుడు అని విమర్శించిన మోత్కుపల్లి ఇప్పుడు లోకేష్, భువనేశ్వరి ఇచ్చిన ప్యాకేజీ తీసుకుని చంద్రబాబు అరెస్టు రాజ్యాంగ విరుద్ధమని, నిరాహార దీక్షలు చేస్తానని ప్రకటిస్తున్నాడని విమర్శించారు. వర్ల రామయ్యకు కూడా రాజ్యసభ ఇస్తానని మోసం చేశాడన్నారు. పార్టీ లేదు...అన్న అచ్చెన్నాయుడిని ఇంకా పార్టీ అధ్యక్షుడిగా కొనసాగించడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు అరెస్టుపై రాష్ట్రంలో కనీస స్పందన లేదన్నారు. దమ్ముంటే చంద్రబాబు న్యాయ పోరాటం చేసి నిజాయతీ నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

పుణ్యకోటి వాహనంపై మలయప్పస్వామి



తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారిని పుణ్యకోటి వాహనంలో ఊరేగించారు. సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో ఉంచి గ్రామ బలిహరణలు పూర్తి చేశారు. అనంతరం స్వామివారిని పల్లకిలో ఉంచి ఉదయం తిరువీధి సేవలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని పుణ్యకోటి వాహనంలో ఉంచి రాత్రి తిరువీధి సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చకస్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, రాజగోపాలాచార్యు లు, సాయి ఆచార్యులు పాల్గొన్నారు.

దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరికి రిమాండ్

అనకాపల్లిటౌన్ : దారిదోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు పట్టణ సీఐ దాడి మోహనరావు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రికి చెందిన రెవెన్యూ ఉద్యోగి కారక అప్పలనాయుడు, ఫొటోగ్రాఫర్ నాలం ప్రసాద్ రాజమండ్రి నుంచి ఆనందపురం వెళ్లేందుకు బస్సులో ప్రయాణిస్తూ నిద్రలోకి జారుకున్నారు. దీంతో బస్సు స్థానిక బస్టాండ్‌కు చేరుకుంది. వారిద్దరూ అక్కడి నుంచి హైవేకు వెళ్తుండగా మార్గంమధ్యలో అప్పలనాయుడు, ప్రసాద్‌లను తాము పోలీసులమంటూ పట్టణానికి చెందిన పొలిమేర సతీష్, నెల్లి జానీబాయ్‌లు శనివారం రాత్రి అడ్డుకొని రూ.25,200 నగదుతోపాటు రెండు సెల్‌ఫోన్లను తీసుకుపోయారు. అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు. ఆదివారం సతీష్, జానీబాయ్‌లను అదుపులోకి తీసుకొని న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టగా పై విధంగా రిమాండ్ విధించినట్టు సీఐ చెప్పారు.

ఎస్‌బీఐలో అగ్నిప్రమాదం

- రూ.1.90 లక్షల ఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లి టౌన్: పట్టణంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఆదివారం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికుల సమాచారం మేరకు హుటాహుటిన ఘటనా స్థలికి అగ్నిమాపక అధికారులు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో రూ.1.90 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక అధికారి బి.నరసింగరావు తెలిపారు.

వృద్ధురాలిపై బాలుడి లైంగికదాడి

- విశాఖ కేజీహెచ్‌కు బాధితురాలి తరలింపు
- కొత్తపట్నంలో ఘటన



వృద్ధురాలి ఇంటి వద్ద విచారణ చేస్తున్న కొత్తకోట సీఐ మహమ్మద్

రావికమతం: మండలంలోని జెడ్.కొత్తపట్నం గ్రామంలో ఘోరం జరిగింది. వృద్ధురాలి(60)పై ఓ బాలుడు(16) లైంగికదాడికి పాల్పడ్డాడు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను 108లో నర్సీపట్నం ఆస్పత్రికి అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. బాధితురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ ఆదివారం ఆ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన మహిళ భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. పిల్లలు లేరు. ఒంటరిగా ఒక పాకలో నివసిస్తోంది. శనివారం రాత్రి వర్షం కురుస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన బాలుడు ఆమె గుడెసెలోకి ప్రవేశించి దాడి చేసి లైంగికదాడికి ఒడిగట్టాడు. ఆ సమయంలో వర్షం కురుస్తుండటంతో కేకలు వేసినా ఎవరికీ వినిపించలేదు. వర్షం తగ్గాక పలువురు పరుగున రావడంతో బాలుడు పరారయ్యాడు. విశాఖ కేజీహెచ్‌లో బాధితురాలు చికిత్స పొందుతోంది. బాలుడిని తల్లిదండ్రుల కస్టడీలో ఉంచామని, విచారణ అనంతరం విశాఖలోని బాలనేరస్తుల కోర్టుకు తరలిస్తామని సీఐ తెలిపారు.

చీమలపాడు సర్పంచ్‌పై దాడి

- పోలీసుల కేసు నమోదు

రావికమతం: మండలంలోని చీమలపాడు సర్పంచ్ వంజరి గంగరాజు (వైఎస్సార్‌సీపీ)పై ఆదివారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి పరారయ్యారు. కొత్తకోట ఎస్‌ఐ విభీషణరావు తెలిపిన వివరాల ప్రకారం.. చీకటి పడిన తర్వాత సర్పంచ్ గంగరాజు తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా, ములకలాపల్లి వద్ద ఎదురుగా మరో బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి అడ్డగించారు. వెంటనే అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పరారయ్యారు. వెంటనే బాధిత సర్పంచ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, హుటాహుటిన ఘటన స్థలానికి వెళ్లి పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- కొట్టాడంటూ పోలీస్ స్టేషన్‌లో హెచ్‌ఎం ఫిర్యాదు
- నోటీసు ఇచ్చి పంపించామని పోలీసుల వెల్లడి
- రంగంలోకి దిగిన ఎస్పీ మురళీకృష్ణ



మృతుడు దానయ్య



మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ



దానయ్య (ఫైల్)

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం పూడిమడకకు చెందిన దానయ్య(17) ఆదివారం ఉదయం ఇంట్లో ఉరేసుకున్నాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మనస్తాపం వల్లే అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ నేపథ్యంలో సున్నితమైన అంశం కావడంతో ఎస్పీ స్థాయి అధికారులు రంగంలోకి దిగారు. ఎటువంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా పోలీసు బందోబస్తు నిర్వహిస్తుండగా, డీఎస్పీ పర్యవేక్షిస్తున్నారు. అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ మురళీకృష్ణ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పూర్వ విద్యార్థి దానయ్య రెండు రోజుల క్రితం పూడిమడక ఉన్నత పాఠశాలకు వెళ్లి అక్కడి ప్రధానోపాధ్యాయునిపై చేయి చేసుకోవడంతోపాటు సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులను టీజింగ్ చేశాడని తెలిపారు. దీంతో హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేయగా, సదరు పూర్వ విద్యార్థిని పోలీస్ స్టేషన్‌కు పిలిచి నోటీసు ఇచ్చి పంపించామన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన కారణం, ఉన్నత పాఠశాలలో వివాద అంశాలపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తామన్నారు. మరోవైపు పోలీసులు దుర్భాషలాడటంతో మనస్తాపానికి గురై దానయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడనేది అతడి కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీసీ కోసం హెచ్‌ఎం పలుమార్లు తిప్పించడం వల్లే గొడవ జరిగి ఉంటుందని, అనంతరం పోలీసు కేసులోకి వెళ్లడంతో మనస్తాపానికి గురయ్యాడని మృతుడి సన్నిహితులు వాపోతున్నారు. కుమారుడి మృతితో తల్లి తీవ్ర దుఃఖసాగరంలో మునిగిపోయింది.

క్లుప్తంగా

వెంకన్నకు విశేష పూజలు



శ్రీవారి అష్టదిక్పాలక సేవలో అర్చకులు

అనకాపల్లిటౌన్: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం ఆలయ భేడా మండపంలో అష్టదిక్పాలక ప్రాకార సేవ నేత్రోత్సవంగా జరిగింది. ముందుగా స్వామి వారికి సుప్రభాత సేవ, అర్చన అర్చకులు పులఖండం గిరిబాబు, విజయబాబులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మి, ఈవో ఆదినారాయణ, ధర్మకర్తలు శ్రీధరాల కోమలి, సుంకర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డైట్‌లో ఎన్ఎస్ఎస్ డే వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ వైకుంఠరావు

అనకాపల్లిటౌన్: సేవే పరమావధిగా పని చేయడమే ఎన్ఎస్ఎస్ ఉద్దేశ్యమని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు అన్నారు. కళాశాల ఆవరణలో ఆదివారం ఎన్ఎస్ఎస్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛ భారత్, ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. కళాశాల దత్తత తీసుకున్న గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.రమేష్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

జోరుగా ఆరోగ్య సురక్ష సర్వే



రక్త పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం

అనకాపల్లిటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే కార్యక్రమం జోరుగా సాగుతోంది. స్థానిక వేల్పులవీధిలో ఏఎన్ఎంలు ఇంటింటి సర్వేలో భాగంగా ఆదివారం రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30 నుంచి ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చెప్తున్నారు.

అనకాపల్లి సినిమాలు

7/జీ బృందావనకాలనీ(మార్నింగ్, సెకండ్‌షో) వారెవ్వా జతగాళ్లు(మధ్యాహ్నం- సాయంత్రం)	రాజా
మార్క్ ఆంటోని	సత్యనారాయణస్క్రీన్-1
కలవరుడు	సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి	షిర్డిసాయి
జవాన్	పర్తిసాయి
జవాన్	వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	శ్రీసత్య
ఎక్స్‌పెండబుల్స్4	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 97 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-16 యూనిట్లు, బీ పాజిటివ్-44 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-27 యూనిట్లు, ఓ నెగిటివ్-3 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్‌ను 97036 19706 నంబర్‌లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 167 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 412 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని 089242 23595 నంబర్‌లో సంప్రదించవచ్చు.

జైజై గణేశా.. బైబై గణేశా

- ఘనంగా వినాయక నిమజ్జనాలు
- భారీగా అన్న సంతర్పణలు, ఊరేగింపులు, సాంస్కృతిక ప్రదర్శనలు

అనకాపల్లిటౌన్: పట్టణంలో వినాయక నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. యువకులు వీధి వీధిన ఏర్పాటు చేసిన గణనాథులు ఆకట్టుకుంటున్నాయి. స్థానిక పల్లపువీధి దాసరిగెడ్డ రహదారిలో డేంజరస్ గైస్ ఆధ్వర్యంలో ఆదివారం గణపతి హోమం జరిగింది. ముందుగా గణపతికి లక్ష గరికపూజ చేశారు. గణపతి మాలలు ధరించిన యువకులు మండపాల్లో దీక్షలను పూర్తి చేసుకుంటున్నారు. కార్యక్రమంలో మాలధారులు రోహిత్ మణికంఠ, దిలీప్, ఆకాష్, మోహన్, తరుణ్, శ్యాంలోహిత్, అజయ్ సంజయ్, పూర్ణచందు పాల్గొన్నారు.

• స్థానిక రింగ్ రోడ్డులో శ్రీబాలగణపతి మండపం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. వైఎస్సార్ సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులు రత్నాకర్‌ను ఘనంగా సత్కరించారు. పార్టీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, శ్రేణులు కొణతాల అచ్చియ్యనాయుడు, కాండ్రేగుల వెంకటరమ సత్యనారాయణ, వేగి శ్రీనివాసరావు, కొణతాల సూరి అప్పారావు, సూరిశెట్టి వికాష్ పాల్గొన్నారు.

సంప్రదాయ గణపతి విగ్రహాలకు బహుమతులు

సంప్రదాయ మట్టి గణపతి విగ్రహాలు, మండపాల సెట్టింగ్‌లకు వినాయక ఉత్సవ నిమజ్జనోత్సవ కమిటీ బహుమతులు అందజేయనుందని కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కమిటీ సభ్యులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టితో తయారు చేసిన గణపతి శిల్పులు, మండపాల్లో సెట్టింగ్‌లు చేసిన యువతను ప్రోత్సహించి ఈ ఏడాది కూడా బహుమతులు అందిస్తామన్నారు. తమ కమిటీ న్యాయ నిర్ణేతలు పట్టణంలోని ప్రతి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మందిరాల వద్దకు వచ్చి విగ్రహంతోపాటు, సెట్టింగ్‌లను ఎంపిక చేస్తారని చెప్పారు. ఈ నెల 27న స్థానిక నెహ్రూచౌక్ ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల చేతుల మీదుగా విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.సోమశేఖర్ పట్నాయక్, కొడుకుల శ్రీకాంత్, కె.రమేష్, బొడ్డేడ స్వామి, ఆడారి ఆదిబాబు, కాండ్రేగుల వాసు, కార్తీక్, చైతన్య పాల్గొన్నారు.



దాసరిగెడ్డ వద్ద మండపంలో లక్ష గరికపూజలో గణపతి



దాసరిగెడ్డ ప్రాంతంలో హోమం నిర్వహిస్తున్న యువకులు

కశింకోట : కశింకోటలో వినాయక నిమజ్జనోత్సవాలు మొదలయ్యాయి. వినాయక నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని పలు వీధుల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వీటిలో అక్కడక్కడ విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. స్థానిక గవరపేటలోని ఆళ్ల వారి వీధి, మధ్య వీధిలోని పద్మశాలి వీధి, గోవిందరావు కాలనీ ప్రాంతాల్లోని వినాయక విగ్రహాలను రిక్షాల మీద, తలపై పెట్టుకుని తీన్‌మార్ వాయిద్యాలు, నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక పెదగుమ్మం వీధి వద్ద శారదానదిలో నిమజ్జనం చేశారు.

భారీగా అన్న సమారాధనలు

సెలవు రోజు కావడంతో ఆదివారం పలుచోట్ల వినాయక ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, భారీ అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. గవరపేటలోని పెద్దగుమ్మం వీధి, కనకమహాలక్ష్మి వీధి, కనకదుర్గ ఆలయ సమీపంలోని అఫీషియల్ కాలనీ, సాయినగర్ తదితర ప్రాంతాల్లో అన్న సమారాధనలు నిర్వహించారు. సాయినగర్‌లోని వినాయక విగ్రహాన్ని పలు రకాల కూరగాయలతో దండలు వేసి అలంకరించారు. శివలింగ దీపార్చన చేశారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు.



రింగ్ రోడ్డులో అన్నదానం ప్రారంభిస్తున్న దాడి రత్నాకర్



కశింకోటలోని గవరపేటలో రిక్షాపై వినాయకుని ఊరేగింపు



గణపతి మండపాన్ని పరిశీలిస్తున్న వినాయక ఉత్సవ నిమజ్జనోత్సవ కమిటీ సభ్యులు



నిమజ్జనానికి వినాయక విగ్రహాన్ని తలపై మోస్తూ..

అలరిస్తున్న వినాయక విగ్రహాలు

కశింకోటలోని పెదబజారులో నెలకొల్పిన సింహవాహన రూఢుడైన వినాయకుడు ఆహూతులను అలరిస్తున్నాడు. ఎస్సీ కాలనీలో సీతారామ సమేత హనుమంతుని చెంత వినాయకుడు, అఫీషియల్ కాలనీలో ఏర్పాటు చేసిన ఆరు అడుగుల పెద్ద వినాయకుడు ఆహూతులను అలరిస్తున్నారు. వాటికి నిత్య పూజలు, భజనలు నిర్వహిస్తూ ఉత్సవాలు జరుపుతున్నారు.



నిమజ్జనానికి తరలివెళ్తున్న గోవిందరావు కాలనీ వినాయకుడు



సాయినగర్ కాలనీలో కూరగాయల దండలతో అలంకరణ



వినాయక ఉత్సవాల్లో అన్న సమారాధనలు



కశింకోటలోని పెద్ద బజారులో అలరిస్తున్న సింహ వాహన గణపతి



ఎస్సీ కాలనీలో సీతారామ ఆంజనేయ సమేత వినాయకుడు



అఫీషియల్ కాలనీలో అలరిస్తున్న ఆరడుగుల భారీ గణనాథుడు

నేడు కాశీవిశ్వేశ్వరస్వామి పాలకవర్గం ప్రమాణస్వీకారం

అనకాపల్లిటౌన్ : కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు పాలకవర్గ సభ్యుడు గ్రద్ది నూకరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

గణపతి పూజతో ఆధ్యాత్మిక చింతన



ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: ఆధ్యాత్మిక చింతనవైపు నడిపించేందుకు వినాయక నవరాత్రులు దోహదపడతాయని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. మండలంలోని గుండాల కూడలి వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువగా యువత గణపతి ఉత్సవాలను నిర్వహించి, ఆరాధించడం అభినందనీయమన్నారు. అంతకు ముందు ఆమె అన్న సమారాధనను ప్రారంభించారు. రింగ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన గణపతిని దర్శించుకున్నారు. ఎంపీ వెంట ఆమె భర్త విష్ణుమూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్‌తో సేవా కార్యక్రమాల్లోకి యువత



సమావేశంలో మాట్లాడుతున్న యుగంధర్

అనకాపల్లిటౌన్: దేశంలో అతిపెద్ద సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ(ఆర్ఎస్ఎస్) అని సంఘ రాష్ట్ర సహ ప్రధాన కార్యదర్శి జి.యుగంధర్ అన్నారు. స్థానిక గౌరీ గ్రంథాలయంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ప్రతిష్టిత వ్యక్తుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో రకరకాల పేర్లతో యువతని సేవా కార్యక్రమాల వైపు ఆర్ఎస్ఎస్ నడిపిస్తోందన్నారు. నగర సంఘ చాలక్ విల్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థానికంగా యువతను సంఘ కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బొడ్డేటి చంద్రశేఖర్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

30 లోగా ఈ క్రాప్ పూర్తి చేయాలి

వ్యవసాయ అధికారి మోహనరావు



ఈ క్రాప్ నమోదుపై ఆరాతీస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు

సబ్బవరం: ఈ క్రాప్ నమోదుకు ఈ నెల 30వ తేదీతో గడువు పూర్తవుతుందని అనకాపల్లి జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహనరావు చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన పంట నమోదుతో పాటు ఈకేవైసీ పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మండలంలోని బోదువలస, మల్లునాయుడుపాలెంలో క్షేత్రస్థాయిలో పంట నమోదు జరుగుతున్న తీరును ఆదివారం ఆయన పరిశీలించారు. పంట నమోదుపై రైతులకు ఉన్న అవగాహనను నేరుగా వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ పంట నమోదు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. రైతులు సాగు చేసిన అన్నిరకాల పంటలు నమోదు చేయాలని వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. ఒక వేళ భూ యజమాని మరణిస్తే సంబంధిత నామినీని గుర్తించి పంట నమోదు చేయాలని సూచించారు. మండలంలో ఈ పంట నమోదు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో పీఎం కిసాన్ కోసం ఈకేవైసీ చేయాల్సిన పెండింగ్ జాబితాపై ఆరా తీశారు. అర్హులైన రైతులను గుర్తించి తక్షణమే ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. రైతులు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, బోదువలస మాజీ సర్పంచ్ కోన సంజీవరావు, నాయకులు అప్పలనాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు పి. హేమలత, బి.రమాదేవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి వేడుకలకు కార్యాచరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆళ్ల నాగేశ్వరరావు

అనకాపల్లిటౌన్: స్థానిక భోగలింగేశ్వరస్వామి ఆలయంలో రానున్న శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు తెలిపారు. ఆలయ ఆవరణలో నూతన పాలకవర్గ తొలి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రి వేడుకల్లో సర్వకామదాంబ అమ్మవారు తొమ్మిది రోజులు పలు అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు. సామూహిక కుంకుమార్చనలు, లలితా పారాయణం, దీపారాధన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నవరాత్రి వేడుకల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.ఆదినారాయణ, ఆలయ ధర్మకర్తలు కృష్ణంరాజు, వాసుపల్లి తాతయ్యలు, కాండ్రేగుల రాము, సింగంపల్లి రాజేశ్వరి, కమిటీ సభ్యులు కొణతాల అప్పాజీ, మెలిపాక దుర్గ, పేరూరి నారాయణరావు పాల్గొన్నారు.

సేవ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ యాత్రను జయప్రదం చేయండి



ఉక్కు పరిరక్షణ యాత్రలో పాల్గొన్న సీపీఎం నేతలు, విద్యార్థులు

అనకాపల్లి రూరల్: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వచ్చే నెల 6 వరకూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ బైక్ యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రుత్తల శంకరరావు కోరారు. ఆదివారం పట్టణంలోని రింగు రోడ్డు నుంచి నెహ్రూ చౌక్ కూడలి వరకు సీపీఎం నేతలు ర్యాలీ చేపట్టారు. సేవ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ యాత్రకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శించారు. దారి పొడవునా కరపత్రాలను పంచిపెడుతూ, సేవ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ అంటూ నినాదాలు చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామని శంకరరావు తెలిపారు. 32 మంది ప్రాణ త్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడానికి ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, సీపీఎం పార్టీ సీనియర్లు ఎం.బాలకృష్ణ, బొప్పే ఉమామహేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎంఎస్ రమణ, జి.తరుణ్ పాల్గొన్నారు.

ఘనంగా మోదీ జన్మదిన పక్షోత్సవాలు



రక్తదాన శిబిరంలో బీజేపీ నేతలు

అనకాపల్లిటౌన్: పీఎం మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. కార్యక్రమాల్లో భాగంగా స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షుడు గేదెల స్వరూప్ ఆధ్వర్యంలో పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు పార్టీ నేతలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.వి.సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి సీహెచ్ నాగేశ్వరరావు, పి.ప్రసాద్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి దిలీప్‌రాజు, తంగేటి శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వి.రమేష్, మండల అధ్యక్షుడు నర్సింగ్‌యాదవ్, కపిల తాతారావు పాల్గొన్నారు.

పెన్షన్‌పై ఎంపీకి పీఆర్టీయూ వినతి

అనకాపల్లిటౌన్: జీపీఎస్ ప్రతిపాదనలను వెనక్కి తీసుకుని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలంటూ ఎంపీ బీవీ సత్యవతిని ఆమె కార్యాలయంలో పీఆర్టీయూ నేతలు ఆదివారం కలిసి కోరారు. ఈ మేరకు వారు ఎంపీకి వినతిపత్రం అందించారు. జీపీఎస్ అమలును వెనక్కి తీసుకుంటూ, సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేసేలా సహాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, కార్యదర్శి పెద్దినాయుడు, ప్రతినిధులు పాల్గొన్నారు.

జీపీఎస్ ఆమోదయోగ్యం కాదు



సమావేశంలో నినాదాలు చేస్తున్న ఫ్యాప్టో నేతలు

అనకాపల్లి రూరల్ : ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతుంటే అది అమలు చేయకుండా జాప్యం చేయడమే కాకుండా జీపీఎస్‌ను అమలు చేస్తామని చెప్పడం అన్యాయమని ఫ్యాప్టో నేతలు అభిప్రాయపడ్డారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. జీపీఎస్‌కు వ్యతిరేకంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ఆందోళనను జయప్రదం చేయాలని నేతలు పిలుపునిచ్చారు. జీపీఎస్ అమలుకు వ్యతిరేకంగా సమావేశంలో నినాదాలు చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి జీపీఎస్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సమావేశానికి హాజరైన ఫ్యాప్టో నేతలు కోరారు. ఉద్యోగుల సొమ్ముతోనే ఇచ్చే పెన్షన్ విధానం తమకు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. జీపీఎస్ మంచిదని భావిస్తే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అమలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో ఛైర్మన్ గొంది చిన్నబ్బాయ్, కో ఛైర్మన్ కె.ఎస్.సాయి ప్రసాద్, జనరల్ సెక్రటరీ ఎన్.సన్యాసినాయుడు, కార్యదర్శి సీహెచ్. నాగేశ్వర్రావు, కార్యవర్గ సభ్యులు వత్సవాయి శ్రీలక్ష్మి, ఏపీసీపీఎస్ఈఏ జిల్లా ఉపాధ్యక్షుడు బోయిన చిన్నారావు, ఏపీసీపీఎస్ఈఏ అనకాపల్లి మండల ప్రధాన కార్యదర్శి ఆర్.గౌరినాయుడు పాల్గొన్నారు.

జీపీఎస్‌పై ప్రభుత్వం పునరాలోచించాలి

మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న గాదె శ్రీనివాసులనాయుడు

అనకాపల్లిటౌన్: జీపీఎస్ విధానం అమలుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని మాజీ ఎమ్మెల్సీ, పీఆర్టీయూ నేత గాదె శ్రీనివాసులనాయుడు కోరారు. స్థానిక నర్సింగరావుపేటలో ఆదివారం పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేయాలన్నదే పీఆర్టీయూ ధ్యేయమన్నారు. ప్రభుత్వం దీనిని రద్దు చేసి జీపీఎస్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చిందన్నారు. జీపీఎస్ అమలు చర్చల్లో భాగంగా తాము కూడా ఏపీ సీపీఎస్ఈఏ సంఘంతో మాట్లాడి, తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన ఏపీసీపీఎస్ఈఏ సంఘాన్ని కాకుండా ఇతరులతో మాట్లాడి నిర్ణయం తీసుకోవడం వలన ప్రయోజనం ఉండదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏపీసీపీఎస్ఈఏ సంఘంతో చర్చించాలని కోరారు. సమస్య పరిష్కారానికి పీఆర్టీయూ సంఘం తరపున రాష్ట్రంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను స్వయంగా కలిసి వినతిపత్రాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి పీఆర్టీయూ కట్టుబడి ఉందన్నారు. ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయుల ఇన్‌స్పెక్షన్, పాఠశాలల తనిఖీ విధానాన్ని ఖండించారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వం, మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సమావేశంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, జిల్లా కార్యదర్శి పెద్దినాయుడు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు విశ్వేశ్వరరావు, పట్టణ, మండల శాఖల కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

ఐద్వా ఢిల్లీ సభను జయప్రదం చేయండి



ఐద్వా బహిరంగ సభ జయప్రదం చేయాలంటూ ప్రచారం చేస్తున్న వరలక్ష్మి

కశింకోట: అక్టోబర్ 5న ఢిల్లీలో మహిళా సమస్యలపై ఐద్వా ఆధ్వర్యంలో జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి కోరారు. మండలంలోని నరసింగబిల్లిలో ఆదివారం సభకు సంబంధించిన కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళలపై హింస, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై దేశ వ్యాప్తంగా మహిళా పోరు యాత్రలు జరుపుతూ, ఢిల్లీలో ఐద్వా కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభకు మహిళలు తరలిరావాలని పిలుపునిచ్చారు. మహిళా ప్రతినిధులు వి.శ్యామల, కె.భవాని, వి.రామలక్ష్మి, కె.మణి, టి.దేవి, కె.కుమారి, డి.షర్మిల తదితరులు పాల్గొన్నారు.